క్లుప్తంగా

4 నుంచి నిరసన దీక్ష

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప శివానందపురంలో ఇంటిని కూల్చి, నిలువు దోపిడీ చేసిన దుండగులను శిక్షించాలని కోరుతూ ఈ నెల 4వ తేదీ నుంచి స్థానిక కలెక్టరేట్ బాధితురాలు పిచ్చమ్మ నిరవధిక నిరసన దీక్ష చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి యన్.వెంకటశివ తెలిపారు. ప్రజా సంఘాల మద్దతుతో రౌండ్ టేబుల్ సమావేశం, కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

డీఎస్సీ హాల్ టికెట్ డౌన్‌లోడ్ సమస్య పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: డీఎస్సీ హాల్ టికెట్లను మే 30వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోమని ప్రభుత్వం చెప్పినా సమస్యలు తలెత్తుతున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రెండు, మూడు సబ్జెక్టులకు దరఖాస్తు చేస్తే.. ఒకటే హాల్ టికెట్ వస్తోందని, యు హావ్ మే నాట్ సెలెక్ట్ ఎనీ పోస్ట్ అని చూపుతోందని తెలిపారు. మిగిలిన పోస్టులకు ఎప్పుడు పరీక్ష? కేంద్రం ఎక్కడ? వివరాలు హాల్ టికెట్‌లో చూపడం లేదన్నారు. పది పరీక్ష ఫలితాల్లో తప్పులు దొర్లినట్లే.. డీఎస్సీ పరీక్ష వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచడంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యాశాఖ తప్పిదంతో రాష్ట్రంలో లక్షలాది మంది డీఎస్సీ రాసే అవకాశం కోల్పోయారన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

శిల్పారామంలో సందడి



చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో వేసవి సందడి కనిపించింది. మరో వారం రోజుల్లో వేసవి సెలవులు ముగియనుండగా శని, ఆదివారాల్లో చిన్నారులతో కలిసి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై స్థానిక అఖిల డ్యాన్స్ అకాడమీ చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. శిల్పారామం పాలనాధికారి కృష్ణ ప్రసాద్, మధుసూదన్‌బాబు పర్యవేక్షించారు.

వృద్ధాశ్రమంలో బ్రెడ్లు పంపిణీ



వృద్ధులకు బ్రెడ్లు అందజేస్తున్న అశోక్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరానికి చెందిన మాకం అశోక్‌కుమార్ వృద్ధులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. తన తండ్రి సంస్మరణ దినం కావడంతో కడప నగర శివార్లలోని బృంద వృద్ధాశ్రమంలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు బాల సుబ్బయ్య, సుధారాణి, స్థానిక ప్రముఖులు భాను ప్రకాశ్ పాల్గొన్నారు.

బిరియానీ సెంటర్ ప్రారంభం



బిరియానీ కొనుగోలు చేస్తున్న వ్యక్తి

కడప కోటిరెడ్డిసర్కిల్: నాణ్యత గల ఆహారం అందించడమే లక్ష్యమని శ్రీసాయి దివాకర్ చెన్నూరు దమ్ బిరియానీ హోటల్ యజమాని జంబుల దివాకర్‌రెడ్డి అన్నారు. కడప నగరంలోని రాయచోటి రింగ్‌రోడ్డు సర్కిల్ వద్ద చెన్నూరు దమ్ బిరియానీ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలు, విభిన్న రుచులకు కేంద్రమైన సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. అతి తక్కువ ధరతో ప్రజలకు విభిన్న రుచులను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. నగర వాసులతోపాటు అన్ని ప్రాంతాల ప్రజలు తమ రెస్టారెంట్ సందర్శించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంకాలమ్మ తల్లికి పూజలు



పూజలందుకుంటున్న అంకాలమ్మతల్లి

కమలాపురం : మండల పరిధిలోని సముద్రంపల్లెలో వెలసిన పురాతన అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే జంతు బలులు ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఎల్లంగారి వెంకటసుబ్బారెడ్డి భక్తులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.

చెత్తశుద్ధి లేక.. పూడిక తీయక



పబ్బాపురంలో మహానాడు వేదిక వద్ద పనిచేస్తున్న కార్మికులు



అక్కాయపల్లెలో చెత్తతో నిండిపోయిన పరిసరాలు

- మహానాడు వేదిక వద్ద శుభ్రం చేసే పనిలో కార్మికులు
- నగరంలో ఎక్కడికక్కడ నిల్వ ఉన్న చెత్తా చెదారం

కడప కార్పొరేషన్: కడప నగరం చెత్తమయమైంది. మహానాడు పుణ్యమా అని పది హేను రోజులుగా నగరంలో ఇంటింటి చెత్త సేకరించేవారుగానీ, వీధులు శుభ్రం చేసే వారుగానీ కరవయ్యారు. వీధుల్లో ఎక్కడా కాలువలు శుభ్రం చేయడం లేదు. పూడిక ఎత్తడం లేదు. ఫాగింగ్, స్ప్రేయింగ్ అసలే లేదు... ఎవరిని అడిగినా ఒకటే మాట...మహానాడులో ఉన్నాం...మహానాడులో ఉన్నాం అని. గత నెల 29వ తేదీ నాటికి మహానాడు అయిపోయినప్పటికీ నగరపాలక అధికారులు ఇంకా ఆ పనుల్లోనే మునిగితేలుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేదిక ఏర్పాటు చేసిన పబ్బాపురం వద్ద చెత్తాచెదారాన్ని ఎత్తివేయుటకు ఆదివారం వందలాది కార్మికులను తరలించారు. సోమవారం అక్కడికే తరలించి చెత్త చెదారం శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కాగా నగరంలో ఇంటింటా పేరుకుపోతున్న చెత్తాచెదారంపై మాత్రం దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో నగర పరిశుభ్రతపై కమిషనర్ శ్రద్ధ వహించడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తెల్లవారుజామునే మార్నింగ్ విజిట్ చేసే ఆయన ఇటీవల మానేశారనే విమర్శలున్నాయి. నగరపాలక అధికారులు ఎమ్మెల్యే ఆదేశాలకు ఇస్తున్న విలువ మేయర్‌కు, పాలకవర్గానికిగానీ ఇవ్వడం లేదని తెలుస్తోంది. మహానాడు కార్యక్రమం విజయవంతానికి విశేషంగా కృషి చేసిన కమిషనర్... అధికార పార్టీ నేతల మెప్పు పొందడానికి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే చర్యలు తీసుకుని చెత్త తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది

పారిశుద్ధ్య కార్మికులందరినీ మహానాడు వేదిక వద్ద శుభ్రం చేయించడానికి తరలించారు. అన్ని వార్డుల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇంటింటి చెత్త సేకరణ చేయడం లేదు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే కనిపిస్తున్నాయి. వాటిలో పందులు, ఆవులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.

– ఐస్‌క్రీం రవి, 23వ డివిజన్ ఇన్‌చార్జి

పదిహేను రోజులుగా ఇదే పరిస్థితి

మహానాడు వేదిక శుభ్రత కోసం కడప నగరంలోని కార్మికులందరినీ తరలించి పనులు చేయిస్తున్నారు. ఎమ్మెల్యే మెప్పు పొందడానికి కమిషనర్ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. కార్మికులకు జీతాలు ఇవ్వమంటే ఇవ్వని కమిషనర్ మహానాడుకు కార్పొరేషన్ నిధులు కుమ్మరించారు.

– రామక్రిష్టారెడ్డి, 44వ డివిజన్ ఇన్‌చార్జి

నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఇన్ని రోజులు మహానాడు వద్ద కార్మికులతో పనిచేయించారు. ఇప్పటికీ అక్కడే చేయించడం సరికాదు. ఎక్కడ చూసినా చెత్త దిబ్బలే కనిపిస్తున్నాయి.ఇంటింటి చెత్త సేకరణ చేయడం లేదు. ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి.

– రెడ్డిప్రసాద్, 43వ డివిజన్ ఇన్‌చార్జి

చంద్రగ్రహణాన్ని వదిలించి వెలుగులు నింపుతాం

– మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: ఏడాది కాలంగా రాష్ట్ర ప్రజలకు పట్టిన చంద్ర గ్రహణాన్ని వదిలించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఈ నెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. దొరసానిపల్లెలోని తన స్వగృహంలో నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో రాచమల్లు మాట్లాడుతూ గత ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాల్లో తాము ఓటమి చెందామన్నారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ, ఆడ బిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం లాంటి గొప్ప పేర్లు పెట్టారేగానీ, ఏవీ అమలు చేయలేదన్నారు. చేనేతలకు, దళితులకు ఉచిత కరెంట్ ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదని తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజలకు డబ్బు ఇస్తే అది గొప్పపని కాదని విమర్శించిన కూటమి నేతలు ఇప్పుడు ఎందుకు అమలు చేయలేకపోతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే ప్రజల్లో అసంతృప్తి మొదలైందని, చంద్రబాబును నమ్మి తాము ఓడిపోయామని ప్రజలే బాహాటంగా చెబుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని మాని వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి నాయకులు కక్షసాధింపు చర్యలను మొదలు పెట్టారన్నారు. 2029 ఎన్నికల్లో తప్పక జగన్ ముఖ్యమంత్రి అవుతాడన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తోపాటు కూటమికి చెందిన వార్డు స్థాయి నేతలు వాడవాడలా ప్రచారం చేశారని తెలిపారు. ప్రభుత్వం మెడలు వంచి సంక్షేమ పథకాలు అమలయ్యేలా ఒత్తిడి తెస్తామన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలల గ్రేడ్‌పై విచారణ చేయాలి



మాట్లాడుతున్న వలరాజు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆంధ్ర ప్రదేశ్‌లో 2023–25 మధ్య యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ కేటాయించిన న్యాక్ గ్రేడ్, అటానమస్‌లపై విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కళాశాలల అఫిలియేషన్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్హతలు, ప్రాజెక్టు పని విధానం, హాజరు, ఫలితాల శాతం దృష్టిలో పెట్టుకుని యూజీసీ నాక్ గ్రేడ్ కేటాయిస్తుందన్నారు. అయితే కొందరు సిండికేట్‌గా మారి అక్రమాలకు పాల్పడుతూ నాక్‌గ్రేడ్, అటానమస్‌లు కేటాయిస్తున్నారని తెలిపారు. ఎన్ని ఇంజినీరింగ్ కాలేజీలున్నాయి? ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి? ఎందరు నిరుద్యోగులున్నారు? మరచి ఇష్టానుసారం అటానమస్ కేటాయిస్తూ వస్తున్నారన్నారు. బోగస్ అటానమస్, నాక్ గ్రేడ్ పొందిన ప్రొద్దుటూరు వాగ్దేవి కళాశాల, గౌతమి ఇంజినీరింగ్ కళాశాలలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తేజ, అరుణ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో ఆధ్యాత్మికతకు అంకురార్పణ



మత గురువును సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్: ముస్లిం బాలల ఆధ్యాత్మికతకు వేసవి శిక్షణ శిబిరాల్లోనే అంకురార్పణ జరుగుతుందని మత గురువు హజరత్ సయ్యద్ జహీర్ అబ్బాస్ ఖాదిరి సాహెబ్ తెలిపారు. స్థానిక నకాష్ వీధిలోని రిజ్వాన్ మసీద్‌లో ఆదివారం వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ జహీర్ అబ్బాస్ ఖాదిరి సాహెబ్ మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆధ్యాత్మిక విద్య అందించిన గురువులు అబ్దుల్ గఫార్, మహమ్మద్ సులేమాన్, అబ్దుల్ కరీం, ఇస్మాయిల్‌లను షా సోషల్ జస్టిస్ వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో షా సోషల్ జస్టిస్ జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ షాబుద్దీన్, బషీరుద్దీన్, అలీమ్ అసద్, జాకీర్ హుస్సేన్, మజీద్ ఇమామ్ పఠాన్ అబ్దుల్ గఫార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అక్రమ అడ్మిషన్లు నియంత్రించాలి



మాట్లాడుతున్న అంకన్న

కడప ఎడ్యుకేషన్: కడప, అన్నమయ్య జిల్లాల్లోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అక్రమ అడ్మిషన్లను నియంత్రించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారికే వత్తాసు పలుకుతున్నారని ఆయన ఆరోపించారు. నగరంలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో అంకన్న మాట్లాడుతూ కడప, పొద్దుటూరు, పులివెందుల, బద్వేల్, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లి ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రారంభానికి మునుపే అడ్మిషన్లు పూర్తి చేశారన్నారు. నర్సరీకే రూ.30వేల నుంచి రూ.40 వేల వరకూ ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. పలు పాఠశాలలు సీబీఎస్ఈ సిలబస్ లేనపప్పటికీ ఉన్నట్లు ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల్ నాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

దళితులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలి

చింతకొమ్మదిన్నె : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు త్వరలో దళితులు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మాతంగి సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం ఆయన దళిత నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. పిఠాపురంలోని మల్లా అనే గ్రామంలో దళితులను సంఘ బహిష్కరణ చేసి వారికి అంగడి సరుకులు ఇవ్వకుండా తాగునీటిని నిలిపివేసి గ్రామాల్లోకి వస్తే చంపుతామని బెదిరించారన్నారు. మూడు రోజుల క్రితం గుంటూరు జిల్లా తెనాలిలో ఇద్దరు దళితులను బహిరంగంగా నడిరోడ్డులోనే స్థానిక సీఐ శ్రీరాములు నాయక్, సీఐ బూట్ కాళ్లతో నొక్కిపట్టి నాలుగు లాఠీలు విరిగిపోయే వరకు కొట్టారన్నారు. చిత్తూరు జిల్లా చంద్రగిరిలో చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామంలో దళిత విద్యార్థికి నోట్లో మూత్రం పోసి అనాగరికంగా కొట్టిరన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 11 నెలల కాలంలో వేలాది మంది ఎస్సీల మీద దాడులు జరిగాయన్నారు. వంగలపూడి అనిత దళితురాలు అయినప్పటికీ కనీసం నోరు మెదపడం లేదన్నారు. జమ్మలమడుగులో నాలుగు సంవత్సరాల పసిబిడ్డను రేప్ చేసి అతికిరాతకంగా చంపినా పట్టించుకోవడం లేదన్నారు. అట్లూరి సుబ్బరాయుడు, ఈజీ గంగయ్య, బియ్యాల లారెన్స్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బలవంతపు బదిలీలను ఆపాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు



డీఈఓకు సమస్యలు విన్నవిస్తున్న ఎస్టీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: బదిలీల పేరుతో ఉపాధ్యాయులను బలవంతంగా బదిలీ చేయడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు తెలిపారు. కడప డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను ఆదివారం తమ కార్యాలయంలో వారు కలిసి ధర్నా నోటీసును ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల విషయంలో రాష్ట్ర విద్యా శాఖకు స్పష్టత లేదని, చట్టాన్ని చట్టు బండలు చేసిందని ఆరోపించారు. ప్రిఫరెన్షియల్ క్యాటగిరి సంబంధించి వికలాంగులు, వితంతువు, విడాకులు పొందిన టీచర్లపై దుర్మార్గపు విధానాలు తెచ్చి మానసిక క్షోభకు గురి చేస్తున్నారన్నారు. బదిలీల విషయంలో ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయం వివాదాస్పదంగా ఉందన్నారు. గణితం స్కూల్ అసిస్టెంట్‌లు 48 మందిని, ఉర్దూ మీడియంలో 19 మందిని, ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌లు 41 మందిని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా బదిలీ చేసి తీరాలంటూ ఆదేశాలివ్వడం దారుణమైన విషయమని వారు తెలిపారు. గంట గంటకూ కొత్త మార్గదర్శకాలను జారీ చేస్తూ గజిబిజి గందరగోళంగా బదిలీల ప్రక్రియ చేపడుతున్నారని తెలిపారు. అందరికీ ఆమోదయోగ్యమైన బదిలీలు నిర్వహించని పక్షంలో ఉద్యమ బాట చేపడతామని తెలిపారు.పీ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్ కార్యవర్గ సభ్యులు జి.గోపీనాథ్ పాల్గొన్నారు.

మినహాయింపు అవసరం

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులను బలవంతంగా బదిలీ కావాలని విద్యాశాఖ పేర్కొనడం సరికాదని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. రిక్వెస్ట్ బదిలీ కోరుకున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను ఆదివారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎస్ హెచ్‌ఎంలలో విల్లింగ్ ఉన్నవారికి వారు కోరుకున్న వెబ్ ఆప్షన్స్ ఇచ్చిన పాఠశాలకు మాత్రమే బదిలీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల గ్రీవెన్స్‌లను పరిశీలించి సందేహాలకు తావు లేకుండా పరిష్కరించాలని కోరారు. ఎస్‌జీటీలకు పదోన్నతులు ఇవ్వాలని, ప్రశాంత వాతావరణంలో బదిలీలు జరిగేలాగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, నంద్యాల రాజగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, ఆలమూరు ప్రసాద్, అబ్దుల్ సలాం, శ్రీరామ్, అల్లూరి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు పట్టి కోళ్లు, పొట్టేలు, మేకపోతులను బలిగా ఇచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మ దేవాలయ సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ఇరుగులమ్మకు అభిషేకం



పూజలందుకుంటున్న ఇరుగులమ్మ

సిద్దవటం: మండలంలోని సిద్దవటం గ్రామ శివారులో మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద పెన్నానది ఒడ్డున ఉన్న ఇరుగులమ్మ అమ్మవారికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించామని ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఇరుగులమ్మ అమ్మవారికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. మరి కొందరు భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయా, కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారని పూజారి తెలిపారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడి

– కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య



మాట్లాడుతున్న డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్: సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా చెన్నూరు మండలం గుర్రంపాడు, ఉప్పరపల్లెలో ఆదివారం సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరిసాగు, అనుకూల రకాల గురించి ఆయన వివరించారు. భారతీయ నూనెగింజెల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త ఎం.ఎం.ఖురేష్ మాట్లాడుతూ నువ్వులు, వేరుశనగ పంటల్లో మేలైన రకాలు, వాటి సాగు సమయాలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఉద్యాన విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మామిడిలో కోత అనంతరం చేపట్టవలసిన పనుల గురించి తెలిపారు.మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం వెంకటరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు మానస, గిరీష్, గ్రామ వ్యవసాయ అధికారులు లక్ష్మీ, కమిలి, రైతులు పాల్గొన్నారు.

నా స్థలంలో దౌర్జన్యంగా రోడ్డు వేశారు



అధికార పార్టీ నేతలు వేసిన సిమెంటు రోడ్డు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కమ్మవారిపల్లె పంచాయతీ మజారా దిగువతురకపల్లెలోని తన తండ్రి సయ్యద్ రహమతుల్లాకు చెందిన గ్రామకంఠంలోని తమ స్వంత స్థలంలో అధికార పార్టీకి చెందిన వారు దౌర్జన్యంగా సిమెంట్ రోడ్డు వేశారని బాధితుడు తెలిపారు. కమ్మవారిపల్లె సర్పంచ్ కుమారుడు అలీబాషా, మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి అనుచరులతో ఆదివారం అక్రమంగా ప్రభుత్వ అధికారుల సహకారంతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారని కమాల్‌బాషా తెలిపారు. రోడ్డు నిర్మాణం బూచిగా చూపి పక్కనే వున్న తమ కుటుంబానికి చెందిన స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆదివారం తమ స్థలానికి అడ్డుగా బండలు పాతారన్నారు. సంబంధిత స్థలం కోర్టు కేసులో ఉందని, ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఉందని చూపించి అడ్డు చెప్పినప్పటికీ, సచివాలయ అధికారులు కానీ, అధికార పార్టీ నాయకులు గానీ పట్టించుకోకుండా మా కుటుంబానికి చెందిన స్త్రీలను కూడా తోసివేశారని ఆరోపించారు. స్థానిక పోలీసులు కూడా అధికార పార్టీకి చెందిన వారికి సహకరిస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేస్తూ ఉన్నతాధికారులు అయినా పరిశీలించి దౌర్జన్యకారులపై చర్యలు తీసుకోవాలని కమాల్‌బాషా కోరారు.


నదిలో జలం.. తీర్చేను దాహం

భానుడి ప్రతాపానికి ప్రజలే కాదు.. జంతువులు కూడా అల్లాడిపోతున్నాయి. వేసవి ఎండల నుంచి కుందూ నదికి ఇపుడు కాస్త ఊరట లభించింది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరడంతో రబీలో కొర్ర, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలకు, పశువులు, మేకలు, గొర్రెల తాగునీటి అవసరాలను నది తీరుస్తోంది. కొందరు యువకులు జలకాలాడుతూ సేద తీరడం కనిపిస్తోంది.

– రాజుపాళెం



చల్లదనం కోసం నీటిలో దిగుతున్న మేకలు, గొర్రెలు



కుందూనదిలో పారుతున్న నీరు

రైతుల సంక్షేమమే యజమానుల లక్ష్యం



సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వెంకట నాగిరెడ్డి

ప్రొద్దుటూరు: రైతుల సంక్షేమమే లక్ష్యమని ఏపీ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ సీడ్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకటనాగిరెడ్డి తెలిపారు. స్థానిక కేసీపీ ఫంక్షన్ హాల్‌లో ఆ సంఘం ఉమ్మడి కడప జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఉమ్మడి కడప జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎం.మల్లికార్జునరావు, జిల్లా అధ్యక్షుడిగా ఎం.మధుసూదన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరర్‌గా బి.గంగాధర్, ఉపాధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, సుధాకర్, సెక్రటరీలుగా ఈశ్వర్‌రెడ్డి, శివరాజు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వెంకటనాగిరెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాలని తెలిపారు. నకిలీ విత్తనం అమ్మితే అసోసియేషన్, అధికారులకు కానీ తెలిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ ఆనంద్ రెడ్డి, జిల్లా నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.